నమస్తే తెలంగాణ
# జగిత్యాల
3 | కరీంనగర్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | JAGTIAL

### నేడు ఆన్‌లైన్ రిపోర్ట్‌కు ఆఖరు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 8 : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో దోస్త్ స్పెషల్ ఫేస్ సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 9లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత ఒక ప్రకటనలో సూచించారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీ పరిధిలో మొత్తం 3157 సీట్లను కేటాయించినట్లు తెలిపారు. మొత్తం మూడు ఫేస్‌లకు 15,950 సీట్లు కేటాయించగా 11,848 మంది విద్యార్థులు క ళాశాలలో రిపోర్ట్ చేశారన్నారు. స్పెషల్ ఫేజ్‌లో 3157 సీట్లకు ప్ర భుత్వ కళాశాలలో 440 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారన్నారు. అలాగే, రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలల్లో 451 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా, ప్రైవేటు కళాశాలలో 2266 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు వివరించారు. స్పె షల్ ఫేస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 9 లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేసి సీట్ల రిజర్వ్ చేసుకోవాలని, లేకుంటే సీటు రిజిస్ట్రేషన్ రద్దవుతుందని స్పష్టం చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు దోస్త్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతాయని, దీనిని విద్యార్థులు గమనించగలరని వివరించారు.

### బీఎస్సీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 8 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ లో నిర్వహించిన హానర్స్, కంప్యూటర్ సైన్స్ రెండో సె మిస్టర్ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అం దుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

# సర్కారు బడులకు నిధులేవి ?

- జాడలేని పాఠశాలల నిర్వహణ పద్దు
- స్కూల్స్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా పట్టని సర్కారు
- రికార్డులు, రిజిస్టర్ల కొనుగోలుకు తప్పని తిప్పలు
- ఎగ్జామ్స్ మెటీరియల్‌కూ ఇబ్బందులే
- పంద్రాగస్టు నాటికైనా ఇవ్వాలంటున్న ఉపాధ్యాయులు




**విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, పాఠశాల విద్యను విస్మరిస్తున్నది. నిధులు ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నది. కేసీఆర్ పాలనలో పాఠశాలల నిర్వహణ పద్దు ఏటా రెండు విడుతలుగా మంజూరు కాగా, కాంగ్రెస్ పాలనలో వాటికి బ్రేక్ పడింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా దిక్కే లేకుండా పోగా, ఫలితంగా స్కూళ్ల మెయింటనెన్స్ అధ్వానంగా మారింది. రికార్డులు, రిజిస్టర్ల కొనుగోలు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి సేకరణతోపాటు సామూహిక కార్యక్రమాల నిర్వహణ కష్టమైపోగా, సంబంధిత ఖర్చులు హెచ్‌ఎంలు, టీచర్లే భరించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా స్పందించి స్కూల్ గ్రాంట్స్‌ను పంద్రాగస్టువరకైనా ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నది.**

జగిత్యాల, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులను పాఠశాలలకు ప్రభుత్వం కొన్నేళ్లుగా కేటాయిస్తూ వస్తున్నది. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న స్కూళ్లకు ₹10వేలు, 30 నుంచి 100 మంది ఉంటే ₹25వేలు, 101 నుంచి 250 వరకు ఉంటే ₹50వేలు, 250 నుంచి వెయ్యి వరకు ఉంటే ₹75వేలు మంజూరు చేస్తారు. వెయ్యి మందికిపైనే ఉంటే ఆ పాఠశాల నిర్వహణకు ₹లక్ష కేటాయిస్తారు. ఏటా రెండు దఫాల్లో మంజూరు చేస్తారు. ఈ నిధులతోనే స్కూల్లో బ్లాక్ బోర్డుల ఏర్పాటు, పెయింటింగ్, టీచర్ల హాజరు రిజిస్టర్ల కొనుగోలు, వార్షిక ప్రణాళిక, టీచింగ్ డైరీ, మంచినీటి సౌకర్యం, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి, పరీక్షల ప్రణాళిక ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల కొనుగోలు, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, క్రీడలకు సున్నం, ఫస్ట్ అయిడ్ బాక్స్, స్వతంత్ర, గణతంత్ర దినోత్సవాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవ నిర్వహణ తదితర కార్యక్రమాలకు హెచ్‌ఎంలు వినియోగిస్తారు. అలాగే పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు సైతం వీటి నుంచే చెల్లిస్తూ వస్తున్నారు.

#### ఇంకా మంజూరవని నిధులు

నిర్వహణ నిధులను విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే విద్యాశాఖ మంజూరు చేయాల్సి ఉంటుంది. జూన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవంతో పాటు బడిబాట కార్యక్రమాలను హెచ్‌ఎంలు చేపట్టాల్సి వస్తున్నది. అయితే ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయి, అడ్మిషన్ల ప్రక్రియ కూడా ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే చాలా సిలబస్‌తో పాటు రెండు యూనిట్ టెస్ట్‌లను సైతం నిర్వహించారు. అయినా ఇంత వరకు స్కూల్‌గ్రాంట్ల కింద నిధులు మంజూరు చేయకపోవడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్‌లోనే స్కూల్ గ్రాంట్స్‌ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ తర్వాత రెండో దశ డిసెంబర్‌లో ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైంది. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన సమయంలో అంటే మార్చిలో విడుదల చేసి, వాటిని ఆగమేఘాల మీద ఖర్చు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు నిధులు ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషనరీ కొనుగోలు చేయడం, బడిబాట లాంటి ఖర్చులు భరించడం, చాక్ పీసులు, డస్టర్ల కొనుగోలు సైతం ఇబ్బందికరంగానే ఉందంటున్నారు. విధిలేని పరిస్థితిలో ఉపాధ్యాయులే సొంతంగా జేబులో నుంచి డబ్బులు వేసుకొని నిర్వహించాల్సిన పరిస్థితి వస్తున్నదని చెబుతున్నారు. అందరు ఉపాధ్యాయుల వ్యక్తిత్వం ఒకేలా ఉండదని, కొన్నిసార్లు టీచర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారని, విసుక్కుంటున్నారని హెచ్‌ఎంలు బాధపడుతున్నారు.

#### క్రీడలకు నిధులు సున్నానే..

చదువులు, పాఠశాలల నిర్వహణకే కాదు గత ప్రభుత్వం ప్రతి పాఠశాలలోను క్రీడలను ప్రోత్సహించేందుకు నిధులు కేటాయిస్తూ వచ్చింది. ప్రాథమిక పాఠశాలకు ₹10వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ₹10వేల చొప్పున ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలోనే కేటాయిస్తూ వచ్చింది. 2013లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం నేపథ్యంలో 8వ తరగతి వరకు విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయడం నిలిపివేశారు. కేవలం 9,10వ తరగతి విద్యార్థుల నుంచి తలా ఒక్కరూపాయి ఆటల ఫీజును వసూలు చేశారు. దీంతో చాలా ఏండ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆటలు అటకెక్కాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దాదాపు మూతపడింది. అయితే గత ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు అత్యంత ముఖ్యమైనవిగా భావించి, క్రీడా సామగ్రి కొనుగోలుకు నిధులు కేటాయించడంతో పాటు, ప్రతి ఏడాది నిర్వహణ కోసం ₹5 నుంచి ₹10వేలను కేటాయించింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఇంత వరకు క్రీడలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. చేస్తుందా..? లేదా..? అన్న విషయంపై స్పష్టత లేదంటున్నారు ఉపాధ్యాయులు. ఆగస్టులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాల్సి ఉంది. అయితే ఇంత వరకు నిధులే లేకపోవడంతో క్రీడోపాధ్యాయులు, పిల్లలను ఆటలకు ఇంత వరకు కనీసం సన్నద్ధం చేయించలేకపోయారు.

#### హెచ్‌ఎంలు, టీచర్ల వణుకు

స్కూల్ గ్రాంట్స్ మంజూరులో ఆలస్యం, జాడలేని క్రీడా నిధులతో పాటు ఇతర సమస్యలపై మాట్లాడేందుకు హెచ్‌ఎంలు, టీచర్లు భయపడుతున్నారు. నిధులు మంజూరు అయ్యాయా..? లేదా..? అన్న వివరాలు చెప్పేందుకు తర్జనభర్జన పడుతూ, 'మేము చెప్పలేం సార్. మా పేరు రాయకండి సార్. రాస్తే మాకు ఇబ్బందులు వస్తాయి సార్' అంటూ తప్పించుకుంటున్నారు. స్కూల్ గ్రాంట్స్‌తో పాటు ఇతర సమస్యలున్నాయని, విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తామంటున్నారని అవి అవుతాయా..? కావా..? అర్థం కావడం లేదని, ఇప్పటి నుంచి మాఫీ చేస్తారా..? గతంలో ఉన్న బకాయిలు సైతం మాఫీ అవుతాయా..? తెలియడం లేదని అంటున్నారు. ఒక్కొక్క పాఠశాలకు ₹30వేల నుంచి ₹40వేల విద్యుత్ బకాయి ఉందని, వాటిపై సైతం స్పష్టత రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే ఏ విషయం గురించైనా అభిప్రాయాలు చెబితే, స్కూల్ ఫొటోలు ఆ పత్రికల్లో ప్రచురితమైతే సంబంధిత స్కూల్ ఉపాధ్యాయులకు ఇబ్బందులు వస్తున్నాయని, తమను వదిలిపెట్టాలని వారు చెబుతున్నారు.

# ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



జగ్గసాగర్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 8: ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, మెరుగైన వైద్య సేవలందేందుకు చర్యలు తీసుకుంటున్నామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. వైద్య సహాయం కోసం తన వద్దకు ఎవరు వచ్చినా ఒక వైద్యుడిగా తనవంతు సహాయ సహకారాలందిస్తానని హామీ నిచ్చారు. గురువారం మెట్‌పల్లి మండలంలోని 15 గ్రామాల్లోని 65 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ₹17.26 లక్షల విలువైన చెక్కులను ఆయన ఆయా గ్రామాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతోనే కోరుట్లలో డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయించినట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిషలూ కృషి చేస్తానన్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పీసు తిరుపతి రెడ్డి, గడ్డం రాజరెడ్డి, పుల్ల జగన్‌గౌడ్, ముదాం నర్సింలు, డాకూరి వెంకటేశ్, నోముల గంగాధర్ తదితరులు ఉన్నారు.

### స్కాలర్‌షిప్ బకాయిల కోసం పోస్ట్‌కార్డు ఉద్యమం




పోస్ట్‌కార్డులను బాక్సులో వేస్తున్న విద్యార్థులు

జగిత్యాల,ఆగస్టు 8:స్కాలర్‌షిప్ బకాయిలు వెంట నే విడుదల చేయాలని విద్యార్థులు పోస్ట్ కార్డు ఉద్య మం నిర్వహించారు. రామకృష్ణ, నలంద, శ్రీచైతన్య, ఎన్‌ఎస్‌వీ డిగ్రీ కళాశాలల విద్యార్థులు గురువారం జ గిత్యాల పోస్టాఫీస్‌కు వచ్చి ప్రభుత్వానికి పోస్ట్‌కార్డులు రాసి పంపారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడు తూ, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంలేదని, దీనివల్ల పరీక్ష ఫీజులు, బస్‌పాస్ లు, రికార్డు బుక్స్, ఇతర అకాడమిక్ ఖర్చులకు ఇబ్బం ది పడుతున్నామని ఆవేదన చెందారు. డిగ్రీ కళాశాలల అసోసియేషన్ మద్దతుతో పోస్ట్‌కార్డుల ద్వారా సీఎంకు తమ బాధను తెలియజేస్తున్నామని తెలిపారు.

### డీఐఈవోగా వెంకటేశ్వర్లు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

జగిత్యాల, ఆగస్టు 8 : జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా డాక్టర్ వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలల ప్రిన్సిపాల్ అసోసియేషన్ సంఘం సభ్యులు, జిల్లా ప్రభుత్వ లెక్చరర్ల సంఘం సభ్యులు, నాన్‌టీచింగ్ సంఘం సభ్యులు, జిల్లా లైబ్రేరియన్ సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెంకటేశ్వర్లు, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

## పగబట్టిన విధి

- ఒకే ఇంట్లో నాలుగునెలల వ్యవధిలోనే ముగ్గురు మృతి

**విధి వెంటాడింది. సంతోషంగా బతుకుతున్న ఓ కుటుంబాన్ని పగబట్టి, నాలుగు నెలల వ్యవధిలోనే ముగ్గురిని పొట్టనబెట్టుకున్నది. మొదట ప్రేమ విఫలమై కొడుకు ఆత్మహత్య చేసుకోగా, తండ్రి గుండె చెదిరింది. కొడుకుపై బెంగతో మంచం పట్టి, మూడు రోజుల కింద మృతిచెందగా, తల్లి షాక్‌లోకి వెళ్లి గురువారం కన్నుమూయగా, రామన్నపేటలో తీవ్ర విషాదాన్ని నింపింది.**



అరుణ(ఫైల్)

మల్యాల, ఆగస్టు 8: రామన్నపేటకు చెందిన వకుళాభరణం శ్రీనివాస్-అరుణ దంపతులు 30 ఏండ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీగా ప్రజలకు సేవలందించారు. వీరికి ఇద్దరు కొడుకులు మణిదీప్ (27), మౌర్య ఉండగా, ఉన్నతంగానే చదివించారు. ఎదిగొచ్చిన కొడుకులను చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. అయితే పెద్ద కొడుకు మణిదీప్ ప్రేమవిఫలమై ఏప్రిల్ 10న ఇంట్లోనే ఉరేసుకున్నాడు. అప్పటి నుంచి తండ్రి శ్రీనివాస్ కుంగిపోయాడు. మనోవేదనతో మంచంపట్టాడు. ఈ నెల 5న మృతి చెందాడు. కొడుకు ఆత్మహత్య, భర్త శ్రీనివాస్ మృతిని అరుణ తట్టుకోలేకపోయింది. తీవ్ర మనోవేదనతో గురువారం చనిపోయింది. అయితే అన్న, తల్లిదండ్రులు వరుసగా మృతిచెందడంతో చిన్న కొడుకు మౌర్య ఒంటరిగా మిగిలి పోయాడు. వరుస మరణాలతో కుంగిపోయాడు.

## పాతకక్షలే కారణం

- హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ




హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 : పూడూర్‌లో ఈ నెల 4న అర్ధరాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్‌గౌడ్(30), మామిడి కమల్‌కు పాతగొడవల కారణంగా మాటలు లేవు. ఇద్దరి ఇండ్లు పక్క పక్కనే. ఈ నేపథ్యంలో హత్య జరగడానికి నాలుగు రోజుల ముందే వీరికి మాటలు కలిశాయి. కమల్‌తోపాటు అతని బంధువైన మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చిలువేరి తిరుపతి కలిసి ఈ నెల 4న ఆదివారం ఉదయం బైక్‌పై పెగడపల్లి మండలంలోని ఐతుపల్లికి గడ్డి కోసేందుకు కూలీకి వెళ్లారు. వర్షం ఎక్కువ పడడంతో గడ్డికోయకుండా తిరిగి పూడూర్‌కు చేరుకున్నారు. గ్రామంలోని బీరప్ప ఆలయం సమీపంలో మద్యం తాగగా, వీరి వద్దకు రాజశేఖర్‌గౌడ్ వచ్చాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగారు. కొద్ది సమయం తర్వాత ఇంకా మద్యం అవసరం ఉండగా రాజశేఖర్ తన ఏటీఎం కార్డు తీసి కమల్‌కు ఇచ్చి, పిన్ నంబర్ చెప్పి బీర్లు తీసుకురావాలని చెప్పాడు. అయితే, కమల్ డబ్బులు విత్‌డ్రా చేయకుండా పూడూర్‌లోని ఓ బెల్ట్ షాపునకు వెళ్లి రెండు బీర్లు తీసుకొని ఫోన్ పే చేశాడు. ముగ్గురూ కలిసి బీరప్ప ఆలయ సమీపంలో కూర్చొని మద్యం తాగారు. రాజశేఖర్ పాతకక్షల విషయాలు గుర్తు చేస్తూ మాట్లాడుతుండగా.. కమల్ అడ్డుపడి పాత విషయాలు ఇప్పుడెందుకు అని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కమల్ పక్కనే ఉన్న కర్రతో రాజశేఖర్ తలపై బలంగా కొట్టాడు. రాజశేఖర్ వెంటనే కమల్‌ను నెట్టేసి తల పట్టుకొని కిందపడిపోయాడు. పక్కనే ఉన్న చిలువేరి తిరుపతి కూడా కర్ర తీసుకొని పలుసార్లు బలంగా కొట్టడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. ఆ వెంటనే తిరుపతి పక్కనే ఉన్న రాజశేఖర్ స్కూటీలో నుంచి పైపు వేసి పెట్రోలు తీశాడు. సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు రాజశేఖర్ మీద పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. దీంతో అతను బిగ్గరగా కేకలు వేయగా.. ఇద్దరూ కలిసి నోట్లో మట్టిపోసి అరవకుండా చేశారు. తర్వాత ఇద్దరూ తమ వద్ద ఉన్న బైక్‌పై గంగాధర మండలానికి పారిపోయారు. మృతుడి ఏటీఎం నుంచి ఒకసారి ₹4500, మరొకసారి ₹400 తీశారు. అక్కడి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు గొర్రెగుండంకు చెందిన చిలువేరి తిరుపతి ఇంటికి వెళ్లారు. ఇద్దరి దుస్తులు రక్తంతో తడిసిపోగా ఒక కవర్లో మూటకట్టారు. కాగా, గురువారం ఉదయం చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద చెట్లపొదల్లో దుస్తులను దాచిపెట్టి కరీంనగర్ వైపు పారిపోతుండగా, పూడూర్ గ్రామ శివారులో కొడిమ్యాల పోలీసులు పట్టుకున్నారు. తర్వాత రిమాండ్‌కు తరలించారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్ఐ సందీప్, సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 8 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు అభ్యర్థులకు అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. వివరాలకు www.telanganaopenschool.org లేదా, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చలువాజు నాగేశ్వర్‌రావు (8309212661)ను సంప్రదించాలని సూచించారు.

### రెండు నెలలైనా జీతాలు ఇవ్వరా..?




నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ముత్తారం, ఆగస్టు 8 : రెండు నెలలుగా జీతాలు అందక కుటుంబాలు గడవక, ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తారీఖున జీతాలు తమకు కలగానే మిగిలిపోయాయని వాపోయారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో నిరసనకు దిగారు. ఎనిమిదో తేదీ వచ్చినా జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జీతాలు ఇప్పించాలని, భవిష్యత్తులో ఇలాంటివి రాకుండా చూసుకోవాలని వేడుకున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, రాజ్‌కుమార్, భూమయ్య, రాజు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శ్యామల, గోవిందరావు, సత్యనారాయణ, సక్రం, కృష్ణమూర్తి, స్వరూప, రోజినా, శ్రీరాములు, నీలిమ, రాఘవేందర్‌రావు, అనిల్ కుమార్, శంకర్, సతీశ్, వెంకట్రాజం, రత్న తదితరులు పాల్గొన్నారు.

